# సైకోసిస్

అడిగోపుల వెంకటరత్నమ్



మా మామయ్య కుమారుడు పెళ్ళికి నే వెళ్ళేసరికి వధూవరులు పెళ్ళి ,టలపై కూర్చొని వున్నారు. ఎంత పేపయిందో తెలియదు. పెళ్ళిపందిరి చాల వైభవంగా అలంకరించారు. కళ్యాణ మంటపం కట్టడానికి దాదాపు వెయ్యి రూపాయలు ఖర్చుపెట్టి వుంటారని ఊహించాను. చాలమంది ఆహూతులున్నారు. అందరికి వెనుక నిలబడ్డ నన్ను ముందుకు వచ్చి కూర్చోమని అన్నాడు అతిధుల్ని రిసీవ్ చేసుకునే ఒకాయన. పరవాలేదంటూ చేతులు కట్టుకొని పెళ్ళిపందిరి, వధూవరులను మార్చి మార్చి చూడసాగాను.

ఆలోచిస్తున్న నేను ఉలిక్కిపడి క్రిందకు చూశాను. ఏడెనిమిదేళ్ళ కుర్రవాడు నా పాంటు పట్టుకొని లాగుతూ, "అక్కడ పిలుస్తున్నారు" అంటూ ఒకవైపుకు చూపాడు. ఆ స్థలం దూరంగా వుండటంవల్ల, అదీకాకుండా అక్కడ కాంతి సరిగా లేకపోవడంవల్ల ఎవరు పిలుస్తున్నారో సరిగా పోల్చుకోలేకపోయాను. కాని ఇద్దరు స్త్రీలు అక్కడ నిలబడి ఉన్నట్లు గమనించాను.

"ఎవరు బాబూ?" అడిగాను.

# సైకోసిస్

ఆ కుర్రవాడు మళ్ళీ ఆ స్త్రీలవైపు చూసాడు. నన్ను కాదేమోననుకున్నాను. కాని కాంతిలో నేను నిలబడి వుండడం వల్ల బాగా కనిపిస్తూ వుండాలి వాళ్ళకు. అందువల్ల నన్ను పిలవడంలో వాళ్లు పొరపడడానికి ఆస్కారం లేదు.

అటు వెళ్ళాను.

మా పెదనాన్న కుమార్తె ఇంద్రాణి. ఆమె ప్రక్క నాకు తెలియని ఒక అమ్మాయి వున్నారు.

"ఎప్పుడొచ్చావ్ అన్నయ్యా?" ఇంద్రాణి అడిగింది.

చెప్పాను.

"మా స్నేహితురాలు మిస్. రేవతి. పోయిన సంవత్సరం బి. ఏ. పాసయింది. పెళ్ళికూతురు తరపువాళ్ళు.... మా అన్నయ్య ప్రకాశరావు. రెండు నెలలే అయింది ఉద్యోగంలో చేరి. ఇంకా...." అని పరిచయం చేసింది. ఇంకా చిలిపితనం ఇంద్రాణిలో పోలేదు. రేవతి చిరునవ్వుతో నాకు నమస్కరించింది. నేను ప్రతి నమస్కారం చేశాను.

"మళ్ళీ ఊరెప్పుడు వెళ్తావ్?" ఇంద్రాణి అడిగింది నన్ను.

"రేపు ఉదయాన్నే."

"రేవతి వాళ్ళది కూడా ఆ వూరే."

"ఎక్కడండి మీరుండేది?" రేవతిని అడిగాను.

చెప్పింది.

ఆ కంఠస్వరం, జవాబు చెప్పిన తీరు నన్నెంతో ఆకర్షించాయి.

"పెళ్ళి ఇక ఎంత సేపట్లో అయిపోతుందో...." అని పందిరివైపు చూసి ఇటు తల తిప్పేసరికి రేవతి "ఊఁ.... ఊఁ...." అని మూల్గుతూ శరీరమంతా మెలికలు తిరిగిపోతూ కూలబడిపోసాగింది. ఇంద్రాణి ఆమెను పట్టుకొని "రేవతి? రేవతి! ఏం జరిగిం"దంటూ దిక్కులు చూస్తోంది, అయోమయంగా నాకేం అర్థంకాలేదు. ఇంద్రాణి వణికిపోతూ వుంది. జనం దూరంలో వున్నారు. దరిదాపులో మమ్మల్ని ఎవరూ గమనించినట్లు లేదు. రేవతి ఇంద్రాణి చేతుల్లో మెలికలు తిరుగుతూ పట్టుతప్పిపోతూ వుంది. మాటలు లేవు—కళ్ళు మూసుకుపోయాయి. మూల్గుతూవుంది. ఇంద్రాణికి సహాయంగా రేవతిని నేను పట్టుకొన్నాను. రేవతి మమ్మల్ని విదిల్చుకుంటోంది ఎంతో బలంతో. మా బలం చాల్లేదు. ఆ జబ్బులో ఆమెకు ఎంతబలం వచ్చింది? మా చేతుల్లోంచి తప్పించుకొని నేలమీద పడిపోయింది.

నాకు భయం కలిగింది. అలాంటి సంఘటన నేనెప్పుడూ అంత దగ్గరలో వుండి చూడలేదు.

"అన్నయ్యా! హాస్పిటల్‌కు వెళ్దాం. ఇవిగో కారు కీస్".

నేను కారును స్టార్ట్‌చేసి దగ్గర్లోకి తీసుకవచ్చాను. ఇద్దరం కష్టపడి ఆమెను కార్లో వేసుకొని హాస్పిటల్‌కు బయలుదేరాము. కొంత దూరం వెళ్ళేసరికి, "ఊ...." అని మూల్గడం తగ్గింది. ఇందాకటిలా మెలికలు తిరగడం లేదు. తీరా గవర్నమెంటు హాస్పిటల్ దగ్గరకు వెళ్ళేటప్పటికి రేవతి మామూలు మనిషయింది. కారాపి.

"ఇంద్రాణీ! వారిని తీసుకురా డాక్టరు దగ్గరకు వెళ్దాం" అన్నాను.

"మనం కార్లో ఇక్కడకు ఎందుకు వచ్చాం?" రేవతి ఇంద్రాణిని అడిగింది. ఇంద్రాణి జరిగిందంతా చెప్పింది.

రేవతి మౌనంగా అంతా విని "క్షమించండి! మీకు శ్రమ కలిగించాను" అంది నాతో.

"ఫరవాలేదు. ఎలాగు వచ్చాం కనుక డాక్టర్ని కన్సల్ట్‌చేసి వెళదాం" అన్నాను.

"ఒద్దండి! ఇలా రావడం మామూలు" అని, వెళ్దాం అన్నట్లు చూచింది ఇంద్రాణి వేపు.

మేము తిరిగి ఇంటికి వచ్చేసరికి వివాహం పూర్తయింది. డిన్నరు పై అంతస్థులో ఏర్పాటుచేశారు. ఆ డిన్నరు ఎరేంజిమెంట్ చాల పొందికగా వుంది. దాదాపు నాలుగు వందలమంది ఒక్కసారి కూర్చునే ఏర్పాటుచేశారు. పాశ్చాత్య సంగీతం అతి తక్కువ స్థాయిలో వినబడుతూంది.

జనం వస్తూ వున్నారు. దాదాపు సగం హాలు కూడా నిండలేదు. నేనొక చోట కూర్చొని చుట్టూ అలంకరించిన రంగు రంగుల ఎలక్ట్రిక్ బల్బులను చూస్తున్నాను. ఎవరో వాకిట్లోకి వచ్చేసరికి ఇద్దరు ఆయనకు నమస్కరించి తీసుకరాసాగారు. ఆయన టేబుల్స్ ప్రక్కన నడచివస్తూంటే కొంతమంది నమస్కరిస్తున్నారు. మరి కొంతమంది ఆప్యాయంగా పలుకరిస్తున్నారు. ఆయన వారితో ముక్తసరిగా మాట్లాడి నడచివస్తున్నాడు.

నా టేబుల్ దగ్గరకు వచ్చేసరికి "మంచిది! నేనిక్కడ కూర్చుంటాను." అని నా ప్రక్కన కూర్చున్నాడు ప్రక్కన వచ్చిన వాళ్ళకు చెప్పి.

ఆయనకు ముప్ఫయి సంవత్సరాలుంటాయి. ఆయన్ను చూస్తే అందానికి ఒక నిర్వచనం ఇవ్వవచ్చు. కాని ఆ వ్యక్తి వస్త్రధారణ నిరాడంబరంగా వుంది.

మా బల్లల ప్రక్కనుండి వెళ్ళేవాళ్ళు కొంతమంది ఆయన్ను పలకరించి వెళ్తున్నారు. ఆయన్ను గూర్చి తెలుసుకోవాలని కుతూహలంగా వుంది నాకు.

ఒక పదహారేళ్ళ అమ్మాయి మా ముందునుంచి వెళ్తూ "ఇక్కడ కూర్చున్నావేమిటి మామయ్యా! అలా వెళ్ళి కూర్చుందాం రండి!" అంది నవ్వుతూ ఆయనతో.

"ముద్దలుచేసి నోట్లో పెడతావేమిటి?" అన్నాడు నవ్వుతూ. ఆ అమ్మాయి సిగ్గుపడుతూ నవ్వి వెళ్ళిపోయింది. అయితే ఆ మాటలకు నాకు నవ్వు ఆగింది కాదు. అప్రయత్నంగా ఆయనవైపు చూశాను. ఆ వైపుతిరిగి నవ్వుతున్నాడు. ఇంత గంభీరంగా వున్నమనిషి ఎంత సున్నితంగా హాస్యమాడాడు!

భోజనం చేయటానికి ఉపక్రమించాను.

"ఎక్స్‌క్యూజ్ మి! ఇందాకటినుంచి మీతో మాట్లాడడానికి వీలుపడలేదు. నా పేరు యశోమిత్ర. ఇంతక్రితం మీరు హాస్పిటల్‌కు తీసుకెళ్ళింది మా చెల్లెల్నే." ఆయనే నన్ను స్వయంగా పలకరించేసరికి నేను సంతోషపడ్డాను. నన్నునేను పరిచయం చేసికోవటం మరచి.

"మీరేం చేస్తుంటారండి? అని అడిగాను.

"సైకాలజీ ప్రొఫెసర్‌గా వుంటున్నాను."

"నాపేరు...." అని మొదలుపెట్టేను"

"నాకు మీ విషయాలు చెప్పారు." అన్నాడు నవ్వుతూ.

"క్షమించండి! ఆ పరిస్థితులలో మీ సిస్టర్ని చూసేసరికి ఏమీ తోచక మీకు చెప్పకుండా హాస్పిటల్‌కు తీసుకవెళ్ళాను" అన్నాను తలవంచుకొని.

"పరవాలేదు. అది మానవ కనీస ధర్మం. అంతా నేను దూరంనుంచి చూస్తున్నాను."

"మీరు చూస్తూనే వున్నారా?"

"అవును చూస్తూ వుండికూడా ఆ పరిస్థితులలో అక్కడకు ఎందుకు రాలేదనికదూ మీ అనుమానం. ప్రాణానికి ప్రాణమైన రక్తసంబంధం మాటా పలుకూ లేకుండా వేటగాని చేతిలో దెబ్బతిని ప్రాణం పోయేటప్పుడు గిలగిల కొట్టుకుంటున్న పక్షిలా వున్నప్పుడు ఏ అన్నయ్య కూడా చూళ్ళేడు. అదిగాక ఇది కొత్తకాదు. రెండు రోజులకొకసారి ఇలాంటి ఫిట్స్ వస్తాయి. అలా వచ్చినప్పుడు తలుపులు వేసి బయటకు వస్తాను. మళ్ళీ పిలిచేంతవరకు దగ్గరకు వెళ్ళను" అన్నాడు బాధగా.

'ఇంత చిన్న వయసులో ఆ అమ్మాయికి ఇలా ఫిట్స్ రావటం దురదృష్టకరం.'

మేము భోజనం చెయ్యడం పూర్త

యింది. నిద్రపోవడానికి ఎంత ప్రయత్నిం చినా నిద్రరాలేదు. ఆ నాటి సంఘటనలు నా కళ్ళముందు కనపడసాగాయి.

ఆ ఉదయాన్నే నేను ఊరికి వెళ్ళ డానికి బయలుదేరి రేవతి, ప్రొఫెసర్‌గారి కోసం చూశాను. కనుపించలేదు. ఇంద్రా ణిని అడిగితే ఒక గంటక్రితమే వెళ్ళి పోయారని చెప్పింది.

త్వరగా ఊరికి వెళ్ళాలి. వాళ్ళతో బాగా పరిచయం చేసుకోవాలి. ఎలా? పరిస్థితులు అనుకూలపడతాయో లేదో.... ప్రొఫెసర్ గారితో మాట్లాడుతూ వుంటే కాలం ఎంత వేగంగా గడచిపోతుంది! ఇక రేవతితో మాట్లాడుతూ ఎన్ని రోజులయినా గడిపే యొచ్చు.

నేను వచ్చిన నాలుగు రోజులకు ఒక రోజు సాయంత్రం బీచ్‌లో నిలబడివున్న నా భుజంపై చేయి పడటంతో వెనుకకు తిరిగి చూశాను.

ఎదురుగా ప్రొఫెసర్‌గారు... ప్రక్కనే రేవతి.

సంతోషంతో వాళ్ళకు నమస్కరించాను.

'ఒంటరిగా బీచ్‌కు రాకూడదు' నవ్వుతూ అన్నాడాయన.

"అంటే?" నవ్వుతూనే అడిగాను. తిరిగి విషయం గ్రహించి.

"చేసుకోవాలనే వుంది. కాని నచ్చిన అమ్మాయి దొరకడంలేదు," అన్నాను.

"వింతగావుందే పిల్ల దొరకలేదంటే బంధువులలో లేరా?"

"లేరండి! వేరే సంబంధాలు చూస్తు న్నారు."

"విష్‌యూ బెస్ట్ ఆఫ్ లక్!" పెద్దగా నవ్వుతూ అన్నాడు.

"మీ కోసం ఇప్పటికి రెండుసార్లు మీ ఆఫీసుకు ఫోనుచేశాను. ఒక రోజు సెలవు పెట్టారని ఇంకోరోజు ఆఫీసు పనిమీద బయటకు వెళ్ళారని చెప్పారు. సరే! ఇక నాకు అర్జంటు పనులున్నందువల్ల మీ నివా సాన్ని వెతకడానికి టైం లేకపోయింది. అన్నట్లు, నిన్న సాయంత్రం మీ ఆఫీసు బాస్ నన్ను కలిశాడు. అతను నా స్నేహి తుడు. మాటల సందర్భంలో మీ ప్రస్తావన వచ్చింది. మీ గురించి ఆయన చాలా విష యాలు చెప్పాడు." అన్నాడు.

"ఏమని చెప్పారు?" తాపీగా అన్నాను.

"చాలా మంచివారని.... ఆఁ...."

"ఆపేశారేం? మంచివాడేగాని పనులు చెయ్యడని." అన్నాను నవ్వుతూ.

ఆ మాటలకు వాళ్ళిద్దరూ నవ్వారు.

"ఎల్లుండి మా రేవతి పుట్టిన రోజు. మీరు తప్పకుండా సాయంత్రం అయిదిం టికి రావాలి." అన్నాడు ప్రొఫెసరు.

"ఎన్ని పనులున్నా మరచిపోకుండా రండి." రేవతి చెప్పింది.

నేను సంతోషంతో తలూపి వస్తా నన్నాను.

ఆ రోజు బర్త్‌డే సెలెబ్రేషన్ అయి పోయి అందరూ వెళ్ళిన తర్వాత మేం ముగ్గురం కొంతసేపు మాట్లాడుకుంటూ కాలం గడిపాం. యశోమిత్ర ఏది మాట్లా డినా ఎంతో ఆలోచించి, హుందాగా మాట్లాడుతున్నాడు. ఇంటికి వచ్చాను. ఆ రోజు వాళ్ళు చేసిన మర్యాద, చూపిన ఆప్యా యత పదేపదే గుర్తుకు వచ్చి నిద్రకు దూర మయ్యాను. వాళ్ళను గురించి ఎందుకింత గాఢంగా ఆలోచిస్తున్నాను? మొన్నటి వరకు వాళ్ళ ఉనికి నాకు తెలియదే!

ఆ తర్వాత రెండు రోజులకు యూని వర్సిటీ ఆఫీసులో పనుండి వెళ్ళి తిరిగి వస్తుంటే లా కాలేజి దగ్గర అంబాసిడరు కారు నా ప్రక్కన సడెన్‌గా ఆగింది.

"హలో!" అంటూ యశోమిత్ర కారు తలుపు తెరుచుకొని బయటకు వచ్చాడు. నల్లని సూటులో వున్నాడు. మొట్టమొదట చూసిన దానికంటే ఇప్పుడెంతో అందంగా వున్నాడు.

"ఎక్కడికి వెళ్తున్నారు? యశోమిత్ర అడిగాడు.

చెప్పాను. "మీరు ఎక్కడికో ప్రయాణం లాగుందే" అన్నాను నఖశిఖ పర్యంతం చూస్తూ.

ఆర్ట్స్ కాలేజీ వెలిడెక్టరీ ఫంక్షన్‌కు నన్ను ఆహ్వానించారు. మీరూ టౌన్లోకేనా? రండి డ్రాప్ చేస్తాను." అని స్టీరింగు ముందు కూర్చున్నాడు.

నన్ను డ్రాప్ చేస్తూ "రేపు సాయంత్రం ఆరు గంటలకు మా క్వార్టరుకు రండి. రేవతి మీరు కనిపించలేదని అడిగింది." అని వెళ్ళిపోయాడు.

చివరి మాటలు వినగానే నేను ఆకా శంలో తేలిపోసాగాను. రేవతి అంటే నా కెందుకింత అభిమానం? ప్రేమిస్తున్నానా? దీనినే ప్రేమంటారా? మరి రేవతి ప్రేమి స్తుందా?

మరునటి రోజు వాళ్ళింటికి వెళ్ళాను. పెద్ద లైబ్రరీ వుంది, ఆ ఇంట్లో. తెలుగు ఇంగ్లీష్ సాహిత్యాలకు సంబంధించిన అమూల్య గ్రంథాలున్నాయి. వాటిని చూడ గానే నాకు ప్రాణం లేచివచ్చింది. కొన్ని పుస్తకాలు చదువుకోడానికి ఇంటికి తెచ్చు కొన్నాను. అలా పుస్తకాల మిషమీద వరు సగా వారం రోజులు వాళ్ళింటికి వెళ్ళాను. వాళ్ళు నాకు మరింత దగ్గరయ్యారు.

ఇక దాదాపు ప్రతిరోజు వాళ్ళింటికి నేను వెళ్ళటం ప్రారంభించాను. ముగ్గురం కలసి ఎన్నో విషయాలు చర్చించటం జరిగేది. సినిమాలకు, షికార్లకు, బీచికి వెళ్ళే

(మిగతా 22 వ పేజీ చూడండి)

# వినోదిని

## సమానావకాశాలు

ఎడ్గార్ హూవర్ ఎఫ్. బి. ఐ. డైరెక్టర్‌గా వున్నప్పుడు. నేర పరిశోధనకు ఆడవారిని నియ మించడానికి ఎంతో అభ్యంతరం చెప్పేవాడు. ఎడ్గార్ హూవర్ మరి ఇక లేకపోవడం వల్ల పాట్రిక్ గ్రే అన్న ఆసామి డైరెక్టర్ అయ్యాడు. పురుషులతోబాటు స్త్రీలకుకూడా సమానంగా ఉద్యోగా లిస్తానని ప్రకటించాడు. కాని పురుషులతోబాటు సమానంగా శిక్షణ పొందాలని షరతు పెట్టాడు. అందుచేత స్త్రీలుకూడా రివాల్వర్, షాట్-గన్. రైఫుల్ ఉపయోగించడం నేర్చుకోవాలి, శరీర వ్యాయామం చేయాలి, ఆత్మ రక్షణ యుక్తులు నేర్చుకోవాలట!

## సమస్యలు

జపాన్‌కు చెందిన ఒకినావా దీవిని అమెరికా ఎన్నాళ్ళో తన అధీనంలో వుంచుకుంది. చివరికి మొన్నీమధ్యన అమెరికా ఆ దీవిని జపాన్‌కు తిరిగి ఇచ్చేసింది. కాని ఈ చర్య దీవిలోని ఎంతో మంది జపాన్ ప్రజలను ఆగ్రహపర్చిందట. ఈ దీవిలో అనేక వేలమంది జపాన్ యువతులు వ్యభిచారం సాగిస్తున్నారు, ఇక్కడే ఎంతోమంది అమెరికన్ సైనికులు వుండటం గమనార్హం. జపాన్ న్యాయచట్టం ప్రకారం వ్యభిచారం నిషేధం. ఈ చట్టం ఎలా అమలుచేయబడు తుందో, ఏమో అని ఒకినావా పోలీసులు అను మానం పడుతున్నారట, దీనికి కారణం ఆ దీవిలో ఇంకా బోలెడు మంది అమెరికన్ అధికారులు, సైనికులు వున్నారట.

## డబ్బుతో తంటా

ఓ పెద్ద బ్రెజిల్ స్టేడియంలో 13 పుట్‌బాల్ మ్యాచ్‌లు జరగబోతున్నాయి. 70 లక్షల మంది క్రీడాభిమానులు క్రిక్కిరిసి కూర్చుని వున్నారు. ఈ పదమూడు మ్యాచిల్లో ఎవరెవరు గెలుస్తారో ఖచ్చితంగా చెబితే ఒక మిలియన్ క్రూజియర్స్ (కరెన్సీ) ఇస్తామని అధికారులు ప్రకటించారట. ఈ పోటీలో పాల్గొనడానికి రెండు క్రూజియర్స్ కట్టాలట. ఎడ్యుర్డో టీక్సీరియా అనే ఆసామి అంతా కరెక్ట్‌గా చెప్పి డబ్బు గెల్చుకున్నాడట. డబ్బు అందుకోగానే చుట్టుపక్కల కొందరు విలన్ పోజులివ్వడం మొదలుపెట్టారట. ఈ శాల్తీ ఇంటికి తిన్నగా చేరుతుందా లేదా అన్న డౌట్ పోలీసువాళ్ళకి వచ్చి అతన్ని ఎక్కడో రహస్యంగా దాచేశారట. లేకపోతే డబ్బు మాయం, శాల్తీ గల్లంతు అయిపోతుంది.

# సైకోసిస్

(15 వ పేజీ తరువాయి)

వాళ్ళం ముగ్గురంకలిసి. ఒక్కోరోజు యశోమిత్ర వుండేవాడు కాదు. అప్పుడు కూడా రేవతి ఎంతో ఆత్మీయురాలుగా మాట్లాడేది. అప్పుడప్పుడు వాళ్ళింట్లోనే భోజనంచేసి వచ్చేవాడిని. కాలంగడుస్తున్న కొద్దీ నేను,రేవతి మరింతదగ్గరకు వచ్చాం.

రెండునెలలు గడిచాయి.

ఒకరోజు సాయంత్రం అయిదు గంటలకు ఆఫీసు పని ముగించుకొని బయటకు వచ్చేసరికి యశోమిత్ర కారు కనిపించింది.

"మీకోసమే వచ్చాను" ఎంతో ఉత్సాహంగా అన్నాడు.

"నాకు కబురుచేస్తే నేనే వచ్చివుండేవాడినికదా. మీకెందు కింత శ్రమ."

"నో....నో.... నేనేం ముసలాడ్ని అనుకున్నారా ఏమిటి?" అన్నాడు, నవ్వుతూ.

అంత ఉత్సాహంగా నేనెప్పుడూ ఆయన్ను చూడలేదు. ఇద్దరం కారెక్కి బీచికి వెళ్ళాం.

"నేనో విషయం మిమ్మల్ని అడుగుతున్నాను" అన్నాడాయన.

"చెప్పండి!"

"మీకు ఎవరితోనైనా వివాహం నిశ్చయమయిందా?"

"లేదు"

"ఒక మంచి సంబంధాన్ని ప్రపోజ్ చేస్తే చేసుకుంటారా?"

"నచ్చితే చేసుకుంటాను."

"చిన్నతనంలోనే మేం తలిదండ్రులను పోగొట్టుకున్నాం. అప్పటినుంచి రేవతికి అన్నీ నేనే. నా సర్వస్వం ఆ అమ్మాయే. మూడు సంవత్సరాలనాడు జర్మనీ ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానంమీద నేను రిసెర్చి చెయ్యడానికి వెళ్ళాను. ప్రతి సంవత్సరం రెండునెలల సెలవులలో ఇక్కడకు వచ్చేవాడిని. పోయిన సంవత్సరం నేనిక్కడకు వచ్చినపుడు మా మేనమామ కుమారునితో రేవతికి వివాహం నిశ్చయమైంది. అన్ని ఏర్పాట్లు ఘనంగా నేను చెయ్యసాగాను. కాని వివాహం నాలుగు రోజులుండగా అతను తన చెల్లెలికి కారు డ్రైవింగ్ నేర్పుతుండగా ప్రమాదం జరిగి ఇద్దరూ చనిపోయారు. చాలా భయంకరమైన చావు అది. చనిపోయిన తర్వాత వాళ్ళ శరీరాలు చూడడానికి చాల మనోవిబ్బరం కావాల్సి వచ్చింది.

మా రేవతికి వాళ్ళిద్దరంటే చాలా ప్రాణం. అంతకంటే నేనింకేమీ చెప్పలేను. ఒకవైపు వాళ్ళు చనిపోయినందుకు మేం విచారిస్తూంటే మా బంధువులు రేవతిని నష్టజాతకురాలని విమర్శించసాగారు. వయసు చాలా చిన్నది కావడంతో వీటన్నిటిని తట్టుకోలేక మానసికంగా షాక్ తిని ఇలా ఫిట్స్ రావటానికి దారితీసింది, దీనినే సైకోసిస్ అంటారు. మందులు వాడి ప్రయోజనంలేదని నాకు తెలుసు. అయినా రక్తసంబంధం ఒప్పుకోదు కదా! మా సైకాలజీ ప్రకారం ఆ అమ్మాయి మనస్సుకు సంతోషం కలిగించి, మనసును మరో వైపు మళ్ళించగలిగి, మామూలు సంసార బంధాలలో నిమగ్నమయ్యే విధంగా చేయ కలిగితే నయమవుతుందని గట్టి నమ్మకం.

అదృష్టవశాత్తు మీరు మా రేవతికి దగ్గరవుతున్నారని తెలుసుకొన్నాను.మీ సాన్నిహిత్యం ప్రేమగా మారి పెళ్ళిచేసుకొనే విధంగా అవకాశం కలుగజేయాలని అంతగా మీకు ఏకాంతాన్ని, స్వేచ్ఛను ఇచ్చాను. ప్రతిసారి రేవతి ముందు మీ వివాహ ప్రసక్తి తెచ్చేవాడిని. అనేకసార్లు మీరు ఒకరినొకరు అర్థంచేసుకొని మరింత దగ్గర కావడానికి అవకాశాలు కల్పించాను. మిమ్మల్ని రేవతి ప్రేమించింది. మానసికంగా సంతోషం కలిగి ఈ విషయాన్ని గురించి మనసులో ఆలోచించుకొంటూ ఎక్కువ కాలాన్ని గడపసాగింది. అదివరకు రెండురోజులకు ఒకసారి వస్తున్న ఫిట్స్ క్రమంగా నాలుగు రోజులకు, మరీ నెలనుంచి వారానికి ఒకసారి వస్తున్నాయి. ఇలాగే పరిచయం సాగి మీతో పెళ్ళి జరిగితే అసలు ఫిట్స్ ఇక రావని నా నమ్మకం" ప్రొఫెసర్ యశోమిత్ర గంభీరంగా ముఖంపెట్టి అన్నాడు.

నేను ఆలోచనలో పడ్డాను. ఇంతక్రితం ఇలాంటి సందర్భం రావచ్చునేమోనని ఊహించినప్పటికి ముఖాముఖి ఈ విషయం తేల్చుకొనే సమయం ఆసన్నమయేసరికి కొంత మానసిక సంఘర్షణకు లోనయ్యాను. నిజంగా ఆమెను ప్రేమిస్తున్నందున పెళ్ళి మాటకు ఎంతో ఆనందం కలిగింది. అయితే మా పెళ్ళి తర్వాత కూడా ఆమెకు ఈ ఫిట్స్ తగ్గకపోయినా ఆమెను జీవితాంతం ప్రేమించే మనోపరిపక్వత వుండాలనే విషయం నా మనస్సుకు తట్టింది. ఈ సంఘర్షణలో నేను ఆమెను విడిచి వుండలేనని తెలుసుకున్నతర్వాత ఇక నా మనసులోని నిర్ణయం ఆయనకు చెప్పాలి. అది నాకు సంతోషదాయకం కూడా.

"నేను రేవతిని పెళ్ళిచేసుకొంటాను ప్రొఫెసర్! మీ అనుమతి, సహకారం మా ప్రేమకెంతో బలాన్నిచ్చాయి."

'మీరు ప్రతిరోజు మా యింటికి రండి. మీ ప్రేమను ఇంకా పెంచుకోండి, మీ ఇద్దరికి పెళ్ళి జరిగితే రేవతికి ఫిట్స్ తగ్గిపోతాయి. అయితే ఇది పెళ్ళికి దారితీయక పోతే రేవతి భరించలేక చనిపోవచ్చు.

"మీరు నామాట నమ్మండి. ఒక బాధ్యత కల వ్యక్తిగా చెప్తున్నాను. నేను రేవతిని తప్పక వివాహం చేసుకొంటాను.

"మీ మీద ఆ నమ్మకం వుంది నాకు. కాని మనిషి తప్పించుకొనిపోయే పరిస్థితుల్ని అద్దంలో చూపడానికి ప్రయత్నిస్తాడు. ఎందుకు చెప్తున్నానంటే మనం సామాన్య మనుషులం."

"మీరు ఈ విషయంలో నన్ను శంకించాల్సిన అవసరం లేదని మరోసారి హామీ ఇస్తున్నాను."

..............

కాలం గడుస్తున్నకొద్దీ వారానికి, పది రోజులకు....ఆ తర్వాత నెలకు ఫిట్స్ రాసాగాయి రేవతికి.

నాలుగు నెలలు గడిచాయి.

యశోమిత్ర మా తల్లిదండ్రులతో మాట్లాడి వివాహం నిశ్చయించాడు. రేవతి మనఃపూర్వకంగా అంగీకరించింది పెళ్ళికి.

పెళ్ళి ఒక వారం రోజులుండగా

"నేను ఒకనెల తర్వాత మళ్ళీ జర్మనీ వెళ్తున్నాను." అన్నాడు ప్రొఫెసర్ యశోమిత్ర.

"మీరు ఇప్పుడు వెళ్ళిపోవటం మాకు బాధగా వుంటుంది."

"అసలు మూడు సంవత్సరాలు జర్మనీలో వుండాల్సింది. కాని రెండు సంవత్సరాలు జరిగిన తర్వాత మధ్యలో ఈ అవాంతరంవల్ల పోలేక నా రిసెర్చి ఆగిపోయింది. వెళ్ళి ఒక సంవత్సరం వుండి వస్తాను. జర్మనీ ప్రత్యేకంగా పంపిన ఆహ్వానాన్ని తిరస్కరించటం మంచిదికాదు."

"అయితే నాదొక సలహా" అన్నాను.

ఏమిటన్నట్లు చూశాడు.

"మీరు వివాహం చేసుకొని వెళ్ళండి."

యశోమిత్ర ఒక్కనిముషం మౌనం వహించి,

"క్షమించండి. మీకొక విషయం చెప్పనందుకు. కారు ఏక్సిడెంట్‌లో మా మామయ్య కుమారుడు, ఆయన చెల్లెలు చనిపోయారని చెప్పానే, — ఆమే నా భార్య ★

